

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 03-09-2025 | సంపుటి - 24 | సంచిక - 115 | రూ : 4 | పేజీలు: 8


## ఆఫ్ఘనిస్థాన్ లో భారీ భూకంపం...

1,411కు పెరిగిన మృతుల సంఖ్య

2లో

## అమెరికాకు లొంగే ప్రసక్తే లేదు

: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టీకరణ

2లో

## పక్కకు జరిగితే చాలు.. కుర్చీలో కూర్చుని నడిపించడానికి సిద్ధంగా ఉన్నారు



2లో

## తెలంగాణలో రైతులకు తీపి కబురు..



2లో



## చనిపోయిన నా తల్లిని అవమానించారు..

### అభ్యంతరకర వ్యాఖ్యలపై మోదీ ఆవేదన

- బీహార్ ర్యాలీలో ఘటన, కాంగ్రెస్, ఆర్జేడీపై మోదీ విమర్శలు
- వ్యాఖ్యల ఘటనపై ఒకరి అరెస్ట్, రాహుల్ క్షమాపణ చెప్పాలన్న అమిత్ షా

దివంగతురాలైన తన తల్లి హీరాబెన్‌ను ఉద్దేశించి బీహార్ లో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భావోద్వేగంతో స్పందించారు. అది కేవలం తన తల్లికి జరిగిన అవమానం కాదని, దేశంలోని కోట్లాది మంది తల్లులు, సోదరీమణులను కించపరచడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహించిన

తరువాయి 2లో

## బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్...

### భగ్గుమన్న 'జాగృతి'



2లో

- జూబ్లీహిల్స్ జాగృతి కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, సంతోష్ రావుకు వ్యతిరేకంగా ప్లకార్డులు
- కవిత ఏ నిర్ణయం తీసుకున్నా వెంటే ఉంటామన్న జాగృతి నేతలు




# బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్... భగ్గుమన్న 'జాగృతి'

**హైదరాబాద్, సెప్టెంబరు 02 :** బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. పార్టీ నుంచి ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే, ఆమె మద్దతుదారులు, జాగృతి కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి ప్రధాన కార్యాలయానికి భారీ సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. 'జై కవితక్క.. జై జాగృతి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఇదే సమయంలో, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, సంతోష్ రావులకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో జాగృతి కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జాగృతి నేతలు మాట్లాడుతూ, కవితను పార్టీ నుంచి బహిష్కరించడం వల్ల ఆమెకు ఎలాంటి నష్టం జరగదని అన్నారు. తన తండ్రి కేసీఆర్‌పై సీబీఐ విచారణను ఆమె తట్టుకోలేకపోయారని తెలిపారు. చాలా రోజులుగా కవితను పార్టీకి దూరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. సామాజిక తెలంగాణ కోసమే కవిత పోరాడుతున్నారని, బడుగు బలహీన వర్గాలు ఆమె వెంటే ఉంటాయని స్పష్టం చేశారు. కవిత ఏ నిర్ణయం తీసుకున్నా తాము కట్టుబడి ఉంటామని తేల్చిచెప్పారు. మరోవైపు, ఈ తాజా పరిణామాలపై ఎమ్మెల్సీ కవిత తన సన్నిహితులతో సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయం నేపథ్యంలో, తన ఎమ్మెల్సీ పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయాలని ఆమె నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ అంశాలపై స్పష్టత ఇచ్చేందుకు ఆమె మీడియా ముందుకు వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆఫ్ఘనిస్థాన్ లో భారీ భూకంపం... 1,411కు పెరిగిన మృతుల సంఖ్య

* **3,100 మందికి పైగా గాయాలు, 5400 ఇళ్లు నేలమట్టం**
* **శిథిలాల కింద చిక్కుకున్న వేలాది మంది ప్రజలు**
* **సహాయక చర్యలకు ఆటంకంగా క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు**

**ఆఫ్ఘనిస్థాన్, సెప్టెంబరు 02 :** ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రకృతి సృష్టించిన ప్రళయానికి భారీ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. సెప్టెంబర్ 1న సంభవించిన శక్తివంతమైన భూకంపం కారణంగా ఇప్పటివరకు కనీసం 1,411 మంది మరణించారని, మరో 3,100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మంగళవారం ప్రకటించారు. ఈ ప్రకృతి విపత్తు ఆఫ్ఘనిస్థాన్‌ను తీవ్ర విషాదంలోకి నెట్టింది. రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతతో నమోదైన ఈ భూకంపం ధాటికి 5,400 కంటే ఎక్కువ ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని ముజాహిద్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. దీంతో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ముఖ్యంగా మట్టి, కలపతో నిర్మించిన ఇళ్లు ఎక్కువగా ఉండటంతో అవి భూ ప్రకంపనలకు తట్టుకోలేక పేకమేడల్లా కూలిపోయాయి. గ్రామాలకు గ్రామాలే నేలమట్టం కావడంతో ప్రజలు శిథిలాల కింద చిక్కుకుపోయారు. చాలామంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోవడం పెను విషాదానికి కారణమైంది. ప్రస్తుతం మారుమూల పర్వత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, సరైన దారులు లేకపోవడం వల్ల సహాయక బృందాలు ఘటనా స్థలాలకు చేరుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి అధికారి ఇంద్రికా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న ఆఫ్ఘనిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఆదుకోవాలని ఇంద్రికా విజ్ఞప్తి చేశారు. మరోవైపు, 2021లో అధికారం చేపట్టిన తర్వాత తాలిబన్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న మూడో అతిపెద్ద భూకంపం ఇది. అంతర్జాతీయ సహాయం కోసం తాలిబన్లు పిలుపునిచ్చినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇతర సంక్షోభాలు, మహిళల హక్కులపై వారు విధిస్తున్న ఆంక్షల కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌కు అందే విదేశీ సాయం గణనీయంగా తగ్గిపోయింది.

# తెలంగాణలో రైతులకు తీపి కబురు..

**హైదరాబాద్, సెప్టెంబరు 02 :** తెలంగాణలో యూరియా లభ్యతపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. నిన్నటికి 9 వేల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని, ఈరోజు రాత్రికి మరో 5 వేల టన్నుల యూరియా వస్తోందని ప్రభుత్వం తెలిపింది. రానున్న వారం రోజుల్లో రాష్ట్రానికి 27,470 టన్నుల యూరియా చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు. రైతులెవ్వరూ ఇబ్బంది పడకుండా యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, వరదల కారణంగా పంట నష్టంపై 5 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# అమెరికాకు లొంగే ప్రసక్తే లేదు
# కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టీకరణ

* **డెడ్‌లైన్లతో ఒప్పందాలు కుదరవన్న పీయూష్ గోయల్**
* **ఇరు దేశాలకు ప్రయోజనం ఉంటేనే ఒప్పందాలు అన్న కేంద్ర మంత్రి**
* **యూరోపియన్ యూనియన్‌తో చర్చలు చివరి దశలో ఉన్నాయని వెల్లడి**




న్యూఢిల్లీ, సెప్టెంబరు 02 : అమెరికాతో వాణిజ్య ఒప్పందాల విషయంలో ఎలాంటి గడువులకు కట్టుబడి ఉండబోమని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఇరుదేశాలకు సమానంగా ప్రయోజనం చేకూరే ఒప్పందాలకు మాత్రమే తాము సిద్ధంగా ఉంటామని ఆయన తేల్చిచెప్పారు. భారత్‌అమెరికా మధ్య వాణిజ్య చర్చలు నిలిచిపోయిన నేపథ్యంలో పరిశ్రమ వర్గాలతో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు ఈ ఏడాది మార్చిలో ప్రారంభమై ఇప్పటివరకు ఐదు విడతలుగా జరిగాయి. అయితే, కీలక అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆరో విడత చర్చలు వాయిదా పడ్డాయి. ఈ ప్రతిష్టంభనకు ప్రధాన కారణం వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలన్న అమెరికా డిమాండే. ఈ డిమాండ్‌కు అంగీకరిస్తే దేశీయ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళనతో భారత్ మొదటి నుంచి దీనిని వ్యతిరేకిస్తోంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం కావడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. మరోవైపు, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ రష్యానే భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది. ఈ పరిణామాల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎగుమతులపై సుంకాలను గణనీయంగా పెంచారు. ఇదిలా ఉండగా, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, గణనీయమైన పురోగతి సాధించామని పీయూష్ గోయల్ వెల్లడించారు.

# ఇది రాష్ట్ర భవిష్యత్తును మార్చే మాస్టర్ ప్లాన్

ఆంధ్రప్రదేశ్ ను తూర్పు తీరానికి ప్రధాన మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఓడరేవును జాతీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి కేంద్రంగా మార్చేందుకు వీలుగా జల, వాయు, రోడ్డు, రైలు మార్గాలను అనుసంధానిస్తూ ఒక సమగ్రమైన కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఈ కీలక ప్రణాళికతో ఏపీని దేశంలోనే అగ్రగామి లాజిస్టిక్స్ హబ్ గా నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం నాడు విశాఖపట్నంలో జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్'కు ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ కు ఉన్న సహజ అనుకూలతలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. "మన రాష్ట్రానికి కేవలం మన అవసరాల కోసమే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, కర్ణాటక వంటి భూపరివేష్టిత రాష్ట్రాల కార్గో రవాణాకు కూడా కీలక కేంద్రంగా మారే అపారమైన అవకాశం ఉంది. వారి సరుకును ఏపీ పోర్టుల ద్వారానే ప్రపంచానికి చేరవేసేలా ఒక పటిష్టమైన కార్యాచరణను అమలు చేస్తున్నాం" అని వివరించారు.

**సమీకృత రవాణా వ్యవస్థే కీలకం**

రాష్ట్రంలో లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేందుకు సమీకృత రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. "ప్రస్తుతం ఉన్న పోర్టులు, కొత్తగా నిర్మించబోయే ఓడరేవులను కలుపుతూ జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, ఎయిర్ కార్గో సదుపాయాలు, అంతర్గత జలమార్గాలను అనుసంధానిస్తాం. దీనికోసం ప్రతి పోర్టుకు ఒక ప్రత్యేక కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ ఉంటుంది. గోదావరి, కృష్ణా నదుల ద్వారా సుమారు 1,500 కిలోమీటర్ల మేర అంతర్గత జల రవాణాకు అవకాశాలున్నాయి. వీటితో పాటు, ఒకప్పుడు వాణిజ్యానికి జీవనాడిగా ఉన్న బకింగ్ హామ్ కెనాల్ ను పునరుద్ధరించి కాకినాడ చెన్నై మధ్య జల రవాణాను తిరిగి ప్రారంభిస్తాం. ఈ చర్యలతో రవాణా వ్యయం గణనీయంగా తగ్గుతుంది" అని చంద్రబాబు అన్నారు. ఈ సదస్సుకు ముందు ముఖ్యమంత్రి, దేశవ్యాప్తంగా వివిధ పోర్టులు, కార్గో కంపెనీలకు చెందిన 62 మంది సీఈఓలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన, టెర్మినళ్ల ఆధునీకరణ, షిప్ బిల్డింగ్ వంటి అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు. భారీ నౌకలు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా 18 మీటర్ల లోతైన ఓడరేవులు తూర్పు తీరంలో ఏపీలో మాత్రమే ఉన్నాయని, ఇది మనకు సానుకూల అంశం అని పేర్కొన్నారు.

**పోర్టు ఆధారిత అభివృద్ధికి శ్రీకారం**

కేవలం రవాణాతోనే ఆగిపోకుండా, పోర్టుల చుట్టూ ఒక పారిశ్రామిక, ఆర్థిక పర్యావరణ వ్యవస్థను నిర్మించనున్నట్లు సీఎం తెలిపారు. "రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ, మూలపేట వంటి పోర్టుల వద్ద పరిశ్రమల ఏర్పాటు, ఆధునిక టౌన్ షిప్ ల నిర్మాణం కోసం దాదాపు 10 వేల ఎకరాల భూమిని సిద్ధం చేస్తున్నాం. ఈ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు త్వరలోనే లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీలను కూడా ఏర్పాటు చేస్తాం," అని ప్రకటించారు. లాజిస్టిక్స్ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా 'ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్' ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర జీఎస్డీపీలో లాజిస్టిక్స్ రంగం వాటాను 3 శాతానికి పెంచే అవకాశం ఉందని, దుగరాజపట్నం వంటి ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్, షిప్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని అన్నారు. ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించేందుకు 1520 మంది పారిశ్రామికవేత్తలతో ఒక సలహా బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# చనిపోయిన నా తల్లిని అవమానించారు..
## అభ్యంతరకర వ్యాఖ్యలపై మోదీ ఆవేదన

(మొదటి పేజీ తరువాయి)
ఓ ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు బీజేపీ ఆరోపించింది. మంగళవారం నాడు బీహార్‌కు చెందిన సుమారు 20 లక్షల మంది మహిళలతో వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు పాల్గొన్న సభలో నా తల్లిని దూషించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి. బీహార్ ప్రజలు కూడా ఈ వ్యాఖ్యలతో బాధపడ్డారని నాకు తెలుసు" అని అన్నారు. తన తల్లి పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ, "మా బట్టల కోసం ప్రతి పైసా కూడబెట్టింది. అనారోగ్యంతో ఉన్నా పనిచేసి కుటుంబాన్ని పోషించింది. దేశంలో అలాంటి తల్లులు కోట్లాది మంది ఉన్నారు. తల్లి స్థానం దేవుడి కంటే గొప్పది" అని మోదీ ఉద్వేగానికి లోనయ్యారు. రాజకుటుంబాల్లో పుట్టిన రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్‌లకు ఒక పేద తల్లి పడిన బాధ, ఆమె కొడుకు చేసే పోరాటం అర్థం కావని విమర్శించారు. అధికారం కోసం స్వార్థంతో పనిచేస్తున్నారని, ప్రజలు తనను ఆశీర్వదించి ప్రధానిని చేస్తే కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. మోదీ తల్లిపై వ్యాఖ్యల పట్ల బీజేపీ నేతలు పాట్నాలోని కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# పక్కకు జరిగితే చాలు.. కుర్చీలో కూర్చుని నడిపించడానికి సిద్ధంగా ఉన్నారు

* **అనుభవంతో చెబుతున్నానన్న రేవంత్ రెడ్డి**
* **హోటల్ దసపల్లాలో 'వైఎస్ఆర్ స్మారక పురస్కారం-2025' ప్రదానోత్సవ కార్యక్రమం**
* **వైఎస్ ఆశయాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందన్న రేవంత్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కుర్చీ నుంచి కొంచెం పక్కకు జరిగితే చాలు, ఆ స్థానంలో కూర్చొని నడిపించడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. తాను అనుభవంతో ఇవి చెబుతున్నానని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో నిర్వహించిన 'వైఎస్ఆర్ స్మారక పురస్కారం 2025' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, కేవీపీ మధ్య ఉన్న అనుబంధం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. కొందరు మేం అన్నీ చూసుకుంటామని చెబుతుంటారని, కానీ ఈ తరానికి ఒకే వైఎస్సార్, ఒకే కేవీపీ ఉంటారని రేవంత్ రెడ్డి అన్నారు. మిత్రుడు వైఎస్ కోసం కేవీపీ సర్వం ధారపోశారని అన్నారు. కేవీపీ ఎప్పుడూ వైఎస్ వెంటే ఉన్నారని అన్నారు. కానీ ఈనాడు చాలామంది కేవీపీ కావాలని అనుకుంటారని, కానీ అలా ఎవరూ కాలేరని అన్నారు. ఒక కేవీపీ కావాలంటే సర్వం త్యాగం చేయగలగాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈరోజుల్లో అలాంటి గుణం ఉన్నవారు ఎవరూ లేరని అన్నారు. మొదటి వారం మనం ఎవరినైనా లోపలకు రానిస్తే, రెండో వారంలో కాస్త పక్కకు జరిగితే ఆ కుర్చీలో కూర్చుని నడుపుతానని చెప్పేవారు ఉన్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ఇంకా మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. వైఎస్ఆర్ కలలు కన్న ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతామని పునరుద్ఘాటించారు. "తుమ్మిడిహట్టి వద్ద మళ్లీ ప్రాజెక్టును నిర్మించి, రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకువస్తాము. ఇది రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగించే ప్రభుత్వంగా నేను ఇస్తున్న మాట" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

# శాంభవి చౌధరి.. బిహార్ రాజకీయాల్లో యువ కెరటం..!

పట్నా: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిహార్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ క్రమంలో లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) యువ నాయకురాలు, సమస్తిపుర్ ఎంపీ శాంభవి చౌధరి తనదైన శైలిలో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాలను భారంగా చూడొద్దని, ప్రజలు ఇచ్చిన ఓ ఆశీర్వాదంగా భావించాలంటున్నారు. మీడియాతో మాట్లాడుతూ.. భగవంతుడి ఆశీస్సులు ఉన్నంతకాలం రాజకీయాల్లో కొనసాగుతాననే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల ఆశీర్వాదం వల్లే..!**

"రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం



కావడంతో తాత, నాన్నపై ప్రజలు చూపిన ప్రేమ, అభిమానాలను కళ్లారా చూశా. ఇప్పుడు నాపైనా అదేవిధమైన ఆదరణ చూపిస్తున్నారు. వారి ఆశీర్వాదాల వల్లే పార్లమెంటులో అడుగుపెట్టగలిగా. రాజకీయాలు అనేవి ఓ బాధ్యత. అన్నివేళలా బాధ్యతగా ఉండాల్సిందే. ఇతర వృత్తులతో పోల్చడం సరికాదు. ప్రతి ఉద్యోగంలో ఇబ్బందులు, సౌలభ్యాలు ఉంటాయి. కానీ, రాజకీయాలు మాత్రం వేరు. ప్రజాభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుంది. కేవలం కష్టపడి పనిచేస్తేనే సరిపోదు.. ప్రజల ఆదరణ పొందాలి. కుటుంబ వారసత్వం ఉన్నప్పటికీ.. రాజకీయాల్లోకి రావాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రజా ఆశీర్వాదంతోనే విజయం సాధించా. ఈ ఘనత మొత్తం మా పార్టీ జాతీయాధ్యక్షుడు చిరాగ్ పాసవాన్‌దే. ఆయన నాకు పెద్దన్న లాంటివారు" అని శాంభవి వివరించారు.

**ఆ మూడు వర్గాలపైనే..?**

"ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నాం. బిహార్ అభివృద్ధి కోసం పని చేస్తున్నాం. పార్టీలను పక్కన పెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలందరూ కూటమి బలోపేతానికి కృషి చేస్తున్నారు. సీఎం నీతీశ్ కుమార్ నేతృత్వంలో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి వైపు తీసుకెళ్లడమే మా లక్ష్యం. తొలిసారి జేడీయూతో కలిసి పోటీచేయనున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో 225 స్థానాల్లో విజయం సాధిస్తాం. దళితులు, మహిళలు, యువతపైనే నా ప్రధాన దృష్టి. ఈ మూడు వర్గాలకు సాధికారత కల్పించే బాధ్యత నా భుజాలపై ఉంది" అని శాంభవి చౌధరి అన్నారు.

# ఏఐఎస్ఎఫ్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



* విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థి లోకం నినాదాలు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందంటూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్త పరిస్థితులను సృష్టించింది. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఒకానొక దశలో కలెక్టరేట్ గేట్లను విద్యార్థులు బలవంతంగా దాటేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. విద్యార్థులు గేట్లపైకి ఎక్కి నినాదాలు చేస్తూ ఏఐఎస్ఎఫ్ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక




సదుపాయాలు లేని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు ప్రశ్నార్థకంగా మారాయి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీ పోరాటాలను కొనసాగిస్తాం” అని హెచ్చరించారు.తరువాత విద్యార్థి ప్రతినిధులు సమస్యలపై వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరక అజిత్, జిల్లా అధ్యక్షుడు ఎస్ కె. షాహిద్, జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, ఇనపెల్లి పవన్ సాయి, ఉపాధ్యక్షులు గుగులోత్ వంశీ, సంజయ్, జిల్లా సమితి సభ్యులు రాజ్ కమల్, మహేష్, నవీన్ తదితరులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న వైఎస్ఆర్

* కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి

* ముస్తాబాద్‌లో దివంగత మాజీ సీఎం వైఎస్ఆర్ వర్ధంతి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత వైఎస్ఆర్ అని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని ముస్తాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు. రైతులకు ఏక కాలంలో లక్ష రూపాయల రుణ మాఫీ చేశారని, పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. 104, 108 సేవలను తీసుకు వచ్చారని తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలన్న ఉద్దేశ్యంతో ఫీజురియంబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకు వచ్చారని అన్నారు. ప్రస్తుతం ఐటి రంగంలో హైదరాబాద్ ఇంత అభివృద్ధి చెందడానికి వైఎస్ఆర్ ప్రధాన కారణమని తెలిపారు. వైఎస్ఆర్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఇలా ప్రతి ఒక్క పథకంలో ఆయన సజీవంగా ఇప్పటికీ ప్రతి తెలుగు వాడి గుండెల్లో ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకునిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గంభీరావుపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి, దుర్భాషలాడి, ఇరు వర్గాల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు మాట్లాడి సోసల్ మీడియాలో పోస్ట్ చేసిన కమలాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. జనరంజకమైన పాలన అందిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడితే ఊరుకునేది లేదని, చట్టపరంగా ముందుకు పోతామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన కౌశిక్



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు:సినీ నటుడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని ఇల్లందులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సత్యనారాయణపురం గ్రామానికి చెందిన యువకుడు కౌశిక్ రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచాడు. అదేవిధంగా యువత అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఎవరు కూడా ఇబ్బంది పడకుండా యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని వేడుకున్నారు.




## నేడు ముఖ్యమంత్రి పర్యటనకు పట్టిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు

: ఎస్పీ రోహిత్ రాజు

* అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను భాద్యతతో సక్రమంగా నిర్వర్తించాలి

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నేడు జరగబోయే గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వెల్లడించారు. చంద్రుగొండ మండలంలో బుధవారం జరగబోయే కార్యక్రమానికి బందోబస్తు విధులు నిర్వర్తించడానికి విచ్చేసిన అధికారులు , సిబ్బందితో చంద్రుగొండలోని లక్ష్య గార్డెన్స్ నందు సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలను చేశారు.సుమారుగా 1200 మంది పోలీసులతో ముఖ్యమంత్రి పర్యటనకు బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.అధికారులు,సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాలలో బాధ్యతగా విధులు నిర్వర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల కదలికలపై ముందస్తుగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సమావేశానికి హాజరయ్యే ప్రజలు,ప్రజాప్రతినిధులు పోలీసు వారికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. బుధవారం ఉదయం 10:00 నుండి సాయంత్రం 5 గంటల వరకు వియం బంజర నుండి కొత్తగూడెం వైపుకు వెళ్లే వాహనాలు కల్లూరు,తల్లాడ,ఏన్కూర్, జూలూరుపాడు మీదుగా కొత్తగూడెం వైపు వెళ్లాలని సూచించారు.అదేవిధంగా కొత్తగూడెం నుండి వియం బంజర వైపు ప్రయాణించే ప్రయాణికులు ఏన్కూర్,తల్లాడ ,కల్లూరు మీదుగా వెళ్లాలని తెలిపారు.సామాన్య ప్రజానీకానికి ట్రాఫిక్ సమస్యలు కలగకుండా పోలీసు వారు చేపట్టిన ట్రాఫిక్ డైవర్షన్ ను పాటించి,వాహనదారులు పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




## న్యూ ప్రశాంత్ నగర్ కాలనీలో ఘనంగా ముగిసిన వినాయక చవితి ఉత్సవాలు

శేరిలింగం పల్లి, ప్రజాస్ఫూర్తి:మియాపూర్ డివిజన్ లోని న్యూ ప్రశాంత్ నగర్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు బుధవారం నుండి ప్రారంభమైన ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఈ ఐదు రోజుల ఉత్సవాలలో మహిళల కోలాటం, చిన్న పిల్లల ఆటపాటలు సాంస్కృతగా కార్యక్రమాలతో ఉత్సాహ భరితంగా సాగింది.చివరి రోజు వినాయక నిమజ్జనం కార్యక్రమంలో వినాయకుడి లడ్డు వేలం పాట జరిగింది. ఇందులో కాలనీకి చెందిన పల్లెపాటి రంగారావు 52,116 రూపాయలకు దక్కించుకున్నారు. చివరి రోజున అన్నదాన కార్యక్రమం తో పాటు నిమజ్జన కార్యక్రమం ముగిసింది.



ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



## విద్యుత్ సమస్యలపై గాంధీనగర్లో పర్యటన

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్లో ప్రజలు ఎదుర్కోంటున్న విద్యుత్ సమస్యలపై మంగళవారం ప్రాగా ఎలక్ట్రికల్ ఎఈ రాములు తో కలిసి స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మి నాధ్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకవచ్చారు. ముఖ్యంగా కరెంటు వైర్ల పైకి చెట్టు కొమ్మలు రావడం, కేబుల్ వైర్ నూతనంగా వేయడం, లాంటి సమస్య లను స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మి నాధ్ అధికారుల దృష్టికి తీసుకు వొచ్చారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, తిమ్మయ్య, నవీన్, అంజి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న గణనాథుడు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జల్దా రాఘవులు, ఎల్లయ్య, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మి నాధ్, శ్రీనివాస్, సాయి గౌడ్,శ్రీధర్, వెంకట సాయి,నర్సింహా, తిమ్మయ్య,నవీన్ తదితరులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలొని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి హజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 191 ఎన్టీఆర్ నగర్ లోని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, కాలప్ప, శివప్ప, రవి, శివ, చిన్న, అరుణ్, సంతోష్, శివకాశి, చరణ్, శివమణి, రాజు, ఉమా, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి కుటుంబాలకు దోమతెరల వితరణ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని తెల్లాపూర్, పిట్టతోగు గ్రామాలకు చెందిన 68 ఆదివాసి కుటుంబాలకు హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం దోమతెరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవి నాయక్ మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో దోమకాటుతో కలిగే వ్యాధులనుంచి ఆదివాసి కుటుంబాలు రక్షించబడాలనే ఉద్దేశంతో (6×6 సైజ్) భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలకు సరిపడే దోమతెరలను అందజేశామని తెలిపారు. పిట్టతోగు గ్రామంలోని 32 కుటుంబాలకు బి. గణేష్ రావు (డిప్యూటీ సెక్రటరీ, విద్యుత్ శాఖ), కె.వి. సోమయాజులు సహకారంతో దోమతెరలు అందజేశారు. తెల్లాపూర్ గ్రామంలోని 36 కుటుంబాలకు జయమ్మ, గణేశం సహకారంతో దోమతెరలు పంపిణీ చేశారు.రోడ్డు మార్గం, విద్యుత్ వంటి సౌకర్యాలు లేకుండా అడవుల్లో నివసిస్తున్న ఆదివాసి కుటుంబాలకు ఈ సహాయం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా ట్రస్ట్ ఆధ్వర్యంలో చలికాలంలో దుప్పట్లు, విద్యార్థులకు నోట్ బుక్స్, బట్టలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మహర్షి స్వచ్ఛద సేవ సంస్థ అధ్యక్షుడు తోల్యం శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

# పాలనకు మానవత్వాన్ని జోడించిన మహనీయుడు వైఎస్సార్

* **ధర్మోజిగూడెంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు**
* **జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు జువ్వి నరసింహ**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గత ముఖ్యమంత్రులకు భిన్నంగా తన పాలనకు మానవత్వాన్ని జోడించి.. ప్రజలకు సుపరిపాలన అందించిన మహనీయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు జువ్వి నరసింహ అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జువ్వి నరసింహ మాట్లాడుతూ సంక్షేమానికి సరికొత్త నిర్వచనమిచ్చిన పాలకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. తన చివరి శ్వాస వరకు ప్రజా సంక్షేమం కోసం పరితపించిన నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లబోతు





నారాయణ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, మండల కాంగ్రెస్ కోశాధికారి ఏనుగు రవీందర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊదరి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఊదరి నరసింహ, నాయకులు కొంతం నరసింహారెడ్డి, కొంతం బుచ్చి రెడ్డి, ఐతరాజు సత్తయ్య, ఐతరాజు బాలయ్య, ఐతరాజు కాశయ్య, ఐతరాజు రోశయ్య, వల్లబోతు సత్తయ్య, బద్రి పోషయ్య, ఐతరాజు లింగస్వామి, ఊదరి శంకర్ సీనియర్ దాసరి కిష్టయ్య, పగిళ్ల మోహన్ రెడ్డి, బద్రి రామలింగం, ఊదరి పోశయ్య, ఐత రాజు యాదగిరి, డాకోజి సతీష్ , రాచకొండ వెంకటేష్, వల్లబోతు కృష్ణ, జంగం శేఖర్, సామిడి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జీడిమెట్ల, ( ప్రజాస్ఫూర్తి) : కన్న కూతురు కంటే కూడా కష్టం లో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తూ ఎమ్మెల్సీ కవిత చేసే పనుల వలన పార్టీకి నష్టం జరుగుతుందని గుర్తించి, పార్టీకి నష్టం కలిగించే వ్యక్తి ఎవరినైనా ఉపేక్షించేది లేదని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.బీఆర్ఎస్ అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ, 60 లక్షల మంది సైనికులు, నాయకులు, కార్యకర్తలు ఉన్న సైన్యమన్నారు. కేసీఆర్ గతంలోనే చెప్పారు తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా సహించమని చెప్పారన్నారు. పార్టీ కంటే ఎవరు పెద్ద వారు కాదనే విషయం ఈ నిర్ణయంతో స్పష్టమైందన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డారు, ఈరోజు పార్టీ కోసం కన్న బిడ్డను కూడా వదులుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు.

## ఘనంగా పూజలందుకున్న విఘ్నేశ్వరుడు

* **గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ ఈటెల**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మా నగర్ పేస్ 1 , శ్రీ రామ్ నగర్ కాలనీ లలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపాల వద్ద గణనాదుడిని బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ , బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి , కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కట్ట కుమార్ లు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం న్యూ ప్రశాంత్ నగర్(కుత్బుల్లాపూర్ గ్రామం), భగత్ సింగ్ నగర్ , సూరారం శివాలయ నగర్ లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి గణనాదుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు.

## హనుమాన్ మందిరం వద్ద అన్నదానం

- **పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించిన గ్రామస్తులు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండల పరిధిలోని కన్సాన్ పల్లి గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొని వినాయకుని మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారికి అన్నదానం ఒక పవిత్రమైన అర్పణగా భావించడం భారతదేశంలో కొన్ని వేల సంవత్సరాలుగా ఉన్న ఒక గొప్ప సంస్కృతి అన్నారు.అన్నదానం ద్వారా భక్తులకు దైవ ఆశీస్సులు లభిస్తాయని, పుణ్యం కూడా వస్తుందని నమ్ముతున్నామని ఇది ఒక సంప్రదాయమన్నారు.



## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం..

- **యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్**

అందోలు, ప్రజాస్ఫూర్తి: అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయనిధి చెక్కులను మాజీ ఏఎంసీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ లు కలిసి అందజేశారు. మంగళవారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక సహాయం ఎంతో సహాయపడుతుందని అన్నారు. ఎవరైనా పేదవారు అనివార్య పరిస్థితులలో ప్రవేట్ ఆసుపత్రులలో చేరి ఆర్థిక ఇబ్బందులకు గురైతే వారికోసం ప్రభుత్వ ఆసుపత్రిలోనే కార్పొరేట్ కు ధీటుగా వైద్యసేవలు అందిస్తున్నారని, ఈ సేవలను పేదవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు తెనుగు మహిపాల్, రామన్నగారి నర్సింలు, చక్రాల వెంకయ్య, వని సత్తయ్య, బేగరి బాల్ రాజ్, బుసనెల్లి శ్రీనివాస్, బుసనెల్లి ఆంజనేయులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కుషాయిగూడలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

ప్రజాస్ఫూర్తి, కాప్రా : హైదరాబాద్ కుషాయిగూడలో శ్రీకృష్ణదేవరాయల సేవాసమితి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మేడ్చల్ జిల్లా కాప్రా సర్కిల్, మీర్పేట్ హెచ్‌బీ కాలనీ నాలుగో డివిజన్ ఫేజ్ వన్ ప్లేగ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, సినీ నటుడు వడ్డే మహేష్ హాజరయ్యారు. వీరు పవన్ కళ్యాణ్ జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వడ్డే మహేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడు అని అన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా భారత రాజకీయాల్లోనూ మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. కేక్ కట్ చేసే సమయంలో ఒక్కసారిగా వర్షం కురవడం పవన్ కళ్యాణ్ ప్రజాదరణకు నిదర్శనమని అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ వేడుకల్లో శ్రీకృష్ణదేవరాయల సేవాసమితి నాయకులు, సభ్యులు, మెగా అభిమానులు, పవర్ స్టార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీబీఐ అక్రమ కేసులను ఖండిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే ధర్నా



ప్రజాస్ఫూర్తి, కాప్రా: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై సీబీఐ అక్రమ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అవినీతి ఆరోపణల పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కి.మీ.ల సొరంగం, 1531 కి.మీ.ల గ్రావిటీ కెనాల్, 141 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమున్న అతిపెద్ద ప్రాజెక్టు. ఇంత పెద్ద ప్రాజెక్టులో ఒకే బ్యారేజీలోని మూడు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు పాడైపోయినట్టేనా?" అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చిన నీరు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే సాధ్యమైందని గుర్తుచేశారు. "కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డే కాదు, అది దాని భాగం మాత్రమే. మేడిగడ్డ రిపేర్‌కు 150200 కోట్ల ఖర్చు వస్తుంది, ఆ ఖర్చు కూడా నిర్మాణ కంపెనీనే భరించాలి. అయితే రిపేర్ ఎందుకు చేయడం లేదో చెప్పలేక సర్కారు సీబీఐకి అప్పగించింద"ని అన్నారు.రాహుల్ గాంధీ సీబీఐ మోడీ చేతిలో ఉందని చెబుతుంటే, ఇక్కడ సీఎం రేవంత్ రెడ్డి సీబీఐకి ప్రాజెక్టు అప్పగించడం పెద్ద నాటకం తప్ప మరేదీ కాదని లక్ష్మారెడ్డి విమర్శించారు. "94 వేల కోట్ల ఖర్చు అయిన ప్రాజెక్టుపై ఒక లక్ష కోట్ల అవినీతి ఆరోపణ చేయడం సిగ్గుచేటు. తెలంగాణ తెచ్చుకుందే నీళ్ల కోసం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి నీళ్లను ఆంధ్రాకు తరలించే కుట్ర చేస్తోంది. నాడు కేసీఆర్ రైతులకు యూరియా బస్తాలు ఇస్తే, నేడు రేవంత్ ఢిల్లీకి డబ్బు బస్తాలు మోస్తున్నాడు" అని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు అధైర్య పడవద్దు... అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

* **కాంగ్రెస్ కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంత రాజు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారీ వర్షాల వల్ల వరదలతో నష్ట పోయిన రైతులు అధైర్య పడవద్దు... అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని కాంగ్రెస్ కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంత రాజు అన్నారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో భారీ వర్షాల వల్ల వరదలకు నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించాలని మండల వ్యవసాయాధికారికి ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో మంగళవారం మండల వ్యవసాయాధికారి కొండాపూర్ గ్రామంలోని పంట పొలాలను సందర్శించి, నష్టపోయిన పంటలపై అంఛనా వేశారు. నష్టపోయిన పంటలపై ప్రభుత్వానికి నివేదిస్తామని, రైతులకు తగిన నష్టపరిహారం అందేలా చూస్తామని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంత రాజు మాట్లాడుతూ రైతన్నకు ఏ కష్టం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ క్యారం రాజు, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బొందుగుల దేవి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వంగ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు క్యారం రామచంద్రం, సోషల్ మీడియా యారెటి భరత్, రైతులున్నారు.

## ప్రజా ప్రభుత్వంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో మొదటి ప్రాధాన్యత కల్పించాలి

* **ముఖ్యమంత్రి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యేలు**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని సహచర ఎమ్మెల్యేలతో పాటు మర్యాదపూర్వకంగా కలిసి గిరిజన జనాభా అధికంగా నివసించే ఎస్టీ నియోజకవర్గాలలో అదనపు ఇందిరమ్మ ఇళ్ళు కెటాయించాలని,వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వంలో మొదటి ఫ్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య , పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ,పినపాక శాసనసభ్యులు వెంకటేశ్వర్లు ,భద్రాచలం శాసనసభ్యులు తెల్ల వెంకటరావు,ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు తదితరులు వినతి పత్రం అందజేశారు.

## రాజిరెడ్డికి మొక్కను అందజేసిన ప్రకృతి ప్రేమికులు మొక్కల రాజశేఖర్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణం, రామవరం తెలంగాణ బొగ్గు ఘనీ కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని రామ వరం ప్రాంతంలో ఆకునూరి కనకరాజు నివాసానికి విచ్చే శారు. ఈ సందర్భంగా ప్రకృతి ప్రేమికుడు మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షురాలు చిరంజీవి నైనిక రజువా, ప్రకృతి హరిత దీక్ష డు చిరంజీవి ముచ్చ యశ్విన్,గౌస్ బాయ్ తదితరులు కలిసి ఆయనకు ఒక మొక్కను అందజేశారు. పచ్చదనం పెంపుదలలో భాగంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ పర్యావరణ పరిరక్షణ అవసరమని చెప్పారు.

# యూరియా కోసం రైతన్నల అవస్థలు



* ఇందిరమ్మ రాజ్యం లో చెప్పల వరుసలు,
* ఇది ప్రజా పాలననా.? లేక ఆధార్ కార్డు,చెప్పల పాలన నా.?
* మాజీ ఎమ్మెల్యే & బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ హరిప్రియనాయక్

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని ఇల్లందు మండలం గ్రామపంచాయతీ నందు ఎరువులు కొరతతో తెల్లవారుజామున మూడు గంటల నుండి రైతులు చెప్పుల వరుసలలో రైతన్నలు పడుతున్న అవస్థలను ఇల్లందు మాజీ ఎమ్మెల్యే & బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ హరిప్రియ నాయక్ పరిశీలించి యూరియా దొరకక రైతన్నలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే &బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ హరిప్రియ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు ఇందిరమ్మ రాజ్యంలో చెప్పులు దర్శనమిస్తున్నాయి ఇదేనా మీరు చెప్పుకుంటున్న ఇందిరమ్మ రాజ్యం ప్రజా పాలన అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దాదాపు ఎన్నో రోజులుగా యూరియా దొరకక రైతన్నలు అవస్థలు పడుతుంటే రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చడానికి సిబిఐ ఎంక్వయిరీ అంటూ మరో కొత్త కథని తెరమీదకి తీసుకొని వచ్చారని అధికారంలోకి వచ్చిన నాటి నుండి డైవర్షన్ పాలిటిక్స్ తప్ప డైరెక్షన్ పాలిటిక్స్ లేవని దుయపడ్డారు. నేడు రాష్ట్రంలో రైతులు యూరియా దొరకక లైన్లో నిల్చడానికి ఓపిక లేక చెప్పులని ఆధార కార్డులని లైన్లో ఉంచుతున్నారని ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో కాంగ్రెస్ పార్టీ పాలనను ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలనను గుర్తుచేసే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని ప్రజలకు ఏ విధంగా అయితే ఆనాటి రోజులు తెస్తానని మాట ఇచ్చాడో నిజంగానే తెచ్చి చూపించిన ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కనీసం యూరియా కూడా దొరకని దౌర్భాగ్య స్థితిలో దుర్భరంగా రైతన్న పరిస్థితి మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సొసైటీలలో యూరియా అందుబాటులో ఉందో లేదో కూడా చూసుకొని విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల పరిపాలన ఉందని, కాంగ్రెస్ నాయకులు యూరియాను దళారులకు అప్పగిస్తూ రైతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా యూరియా పంపిణీ జరగాలని డిమాండ్ చేశారు. ఆనాడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పంట సాగుకు రెండు నెలల ముందుగానే సరిపడా యూరియా అందుబాటులో ఉండేదని నేడు ఎందుకు అందుబాటులో ఉండదని దీనిపై స్థానిక ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా అసలు నియోజకవర్గంలో యూరియా సమస్య లేదని కట్టుకథలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నేడు ఇల్లందు నియోజకవర్గంలో క్యూ లైన్ లో చెప్పులు దర్శనమిస్తుంటే ఏం సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్ళు తెరవాలని సరిపడా యూరియా రైతులకు అందుబాటులో ఉంచి వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల పార్టీ కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, మాజీ వైస్ ఎంపీపీ ప్రమోద్, మండల పార్టీ వైస్ ప్రెసిడెంట్ బానోత్ రమేష్ నాయక్ పిఎస్ఎస్ వైస్ చైర్మన్ బండారి శీను మాజి కో ఆప్షన్స్ సభ్యులు గాజీ, ఇల్లందు మండలం సోషల్ మీడియా సురేష్ నాయక్ హుస్సేన్ నాయక్ సూత్రం సమ్మయ్య ఆంజనేయులు మంగీలాల్ ముఖ్య వీరన్న కునుసోత్ రమేష్ రచ్చ జ్యోతి బాబు ఐలు యాకయ్య ఐలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు చౌటుప్పల్ లో ఘన స్వాగతం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావుకు చౌటుప్పల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘన స్వాగతం పలికారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామాన్ని సందర్శించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపే కార్యక్రమం చేపట్టారు. జాతీయ రహదారి వెంట చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామంలో గుండ్రంపల్లికి వెళ్తున్న తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు మార్గమధ్యంలో బిజెపి శ్రేణులు స్వాగతం పలికాయి. పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కాసేపు ఆగి, కార్యకర్తలతో ముచ్చటించారు. అనంతరం గుండ్రంపల్లికి పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణగోని శంకరయ్య, దోనూరి వీరారెడ్డి, రమణగోని దీపిక, ముత్యాల భూపాల్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, ఊడుగు యాదయ్య గౌడ్, ఊడుగు వెంకటేశం గౌడ్, కడారి ఐలయ్య, వనం ధనంజయ, ఊదరి రంగయ్య, గుండెబోయిన వేణు, బుడ్డ సురేష్, తోకల సాయి, నల్ల శివప్రసాద్, అమృతం దశరథ, పర్నె గాయత్రి, ఊదరి శారద, బత్తిని విజయలక్ష్మి శేఖర్ రెడ్డి, మల్లేశం రమేష్, 28, 29 వ బూత్ అధ్యక్షులు బాతరాజు ప్రవీణ్, ఇటికల దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో మహాగణపతి నవరాత్రి ఉత్సవాలు



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మతాలకు అతీతంగా ఇంతియాజ్ మహాగణపతి నవరాత్రులలో భక్తిశ్రద్ధలతో పాల్గొనడమే కాకుండా తన స్నేహితుల బృందంతో ప్రదీప్ సహకారంతో కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నాడు.ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ నవరాత్రులు ఎంతో ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ఇక్కడ ఇంతియాజ్ గణేష్మండపాన్ని ఏర్పాటు చేయడం కాకుండా అన్ని పూజా కార్యక్రమాలను కూడా స్వయానా పాల్గొంటూ ముందుండి నడిపిస్తున్నాడు.. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు, స్థానిక మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ గణేష్ మండపాన్ని సందర్శించారు, ఈ సందర్భంగా ఇంతియాజ్ యొక్క భక్తిశ్రద్ధలను కొనియాడారు. అన్నదాన కార్యక్రమానికి ముఖ్యంగా స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ ఇతర నాయకులు పాల్గొన్నారనీ, భక్తుల అధిక సంఖ్యలో ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తితో అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ముఖ్యంగా యూత్ సభ్యులు ఈ కార్యక్రమానికి పవన్, అనిల్ గౌడ్, ఇంతియాజ్, తింబు, పృద్వి, రామకుమార్, సురేష్ ,నాని, కిరణ్, సంతోష్ ,నరేష్ ,వాసు, అర్జున్, వినయ్ అందరూ ఎంతో సహకరించారని వారందరికీ కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు...




## ఘనంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

* లింగోజిగూడెం జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులకు షూ పంపిణీ

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం వేడుకలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ దేవాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ కు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొన్ చౌటుప్పల్ జనసేన మండల పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షూస్ షూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పర్నె



శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు తొర్పునూరి లింగస్వామి గౌడ్, పెద్దగొని లింగస్వామి, మామిడి శివ, సిహెచ్ ప్రశాంత్, సిహెచ్ రాజీవ్, బత్తిని గణేష్, మల్లేష్, బంగారు అంజిబాబు, రెహాన్, చెరుకు లింగస్వామి, సుల్తాన్ రాజు, సాగర్, సంజు తదితరులు పాల్గొన్నారు.

## సరిపడా యూరియా అందుబాటులో ఉంది

* విపక్షాలు రైతుల విషయంలో రాజకీయం చేయొద్దు....
* రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, విపక్షాలు రైతుల విషయంలో రాజకీయం చేస్తున్నారని రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమ్మిల మహేందర్ గౌడ్ విమర్శించారు. మంగళవారం రాజపేట లోని గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాజాపేట మండల కేంద్రంలో మండలంలోని రైతులను యూరియా విషయంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు అయోమయానికి గురి చేస్తున్నారని, కావలసినంత యూరియా రోజు విడిచి రోజువారీగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంటే కావాలని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారి తగినంత తెప్పిస్తున్నారు. మండలానికి సాగునీరు రైతుల సమస్యల పైన వెంట వెంటనే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కారానికి



ముందుంటున్నారన్నారు. ఇది చూసే ప్రతిపక్షాలు ఓర్వలేక గందరగోళం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు జిల్లా నియోజకవర్గ మండల గ్రామ శాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అసెంబ్లీలో 42 శాతం బీసీ బిల్లు ఆమోదం తెలిపి గవర్నర్ కి పంపిన కారణంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.





## యూరియా కోసం రైతుల పడిగాపులు

* సరిపడా యూరియా అందించాలని డిమాండ్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలో రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. ఆధార్ కార్డులు, పట్టా పాసు బుక్కుల లైన్లో పెట్టి యూరియా బస్తాల కోసం ఎదురు చూశారు. మంగళవారం బదనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 200 యూరియా బస్తాలు రాగా, సుమారు 500 మందికి పైచిలుకు రైతులు యూరియా కోసం అక్కడికి చేరుకున్నారు. 200 బస్తాల యూరియా ఇంత మంది రైతులకు ఏ విధంగా సరిపోతుందంటూ రైతులు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు రైతులకు సరిపడా యూరియా అందిస్తున్నామని చెప్తున్నప్పటికీ సరిపడా యూరియా అందడం లేదని రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా అందించడం విఫమలవుతుందని విమర్శించారు. సరైన సమయంలో యూరియా అందించకపోతే తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని రైతులకు సరిపడా యూరియా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు

## సీజనల్ వ్యాధులు – నివారణ చర్యలు..

* మండల వైద్య అధికారి డా.ప్రవీణ్ కుమార్



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : వర్షాల కారణంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్య అధికారి డా.ప్రవీణ్ కుమార్ సూచించారు. సాధారణంగా వచ్చే సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, డయేరియా, టైఫాయిడ్ నివారణకు శుభ్రమైన నీరు మాత్రమే తాగాలని, నీటిని తప్పనిసరిగా మరిగించి వాడాలన్నారు. దోమల నివారణ చర్యలు (మోస్కిటో నెట్లు, రిపెలెంట్లు, కాయిల్స్) వాడాలని,ఇళ్ల చుట్టుపక్కల నిల్వ నీరు ఉండనీయకూడదన్నారు.వేడి నీటి స్నానం చేయడం వలన చర్మ సంబంధిత వ్యాధులు నివారించుకోవచ్చని, వెచ్చటిదుస్తులు ధరించడం, ఉతికిన బట్టలు ఐరన్ చేసి వాడటం చేయాలన్నారు. తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రపరచు కోవడం. హ్యాండ్ వాష్ టెక్నిక్, వేడి ఆహారం, గోరువెచ్చని నీరు మాత్రమే వాడాలన్నారు.ఏదైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని మన రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సి)ని సంప్రదించాలని వైద్యాధికారి సూచనమేరకు తగిన టెస్టులు చేయించుకొని మందులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ లో జ్వరానికి సంబంధించిన అన్ని రకాల రక్త పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

## నాగర్జున్ నగర్ కాలనీలో ఘనంగా వినాయక పూజలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ నాగర్జున నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 01లో బాలగణేష్ ఉత్సవ కమిటి పేరుతో చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయకుడు ఘనంగా పూజలు అందుకుంటున్నారు. చిన్నారులు ప్రతి రోజు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తుండటం చూడముచ్చటగా ఉంది. మంగళవారం వినాయక మంటవం వద్ద కాలనీ మహిళతో కలసి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. గత ఆరు రోజులుగా పూజలు అందుకున్న వినాయకుడిని అంగరంగ వైభవంగా సాయంత్రం నిమజ్జన శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు ములుగు సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, అమర శ్రీనివాస్, మహేష్గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సువర్ణ, సులోచణ, సుజాత, ప్రమీల, ధనలక్ష్మి, రాధిక, మంజుల, స్వప్న, వాణి, శైలజా, సబిత, కవిత, భార్గవి తదితరులు పాల్గున్నారు.

## పలు వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులకు ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్ల నియామకం

అమరావతి: ఏపీలో 3 ప్రభుత్వ వైద్య కళాశాలలకు ప్రిన్సిపల్స్, 4 బోధనాసుపత్రు లకు సూపరింటెండెంట్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయ నగరం వైద్య కళాశాల ప్రిన్సిపల్గా డాక్టర్ దేవి మాధవి, అనంతపురం వైద్య కళాశాలకు ప్రిన్సిపల్గా డాక్టర్ విజయశ్రీ, మచిలీపట్నం జీజీహెచ్ సూపరిటెండెంట్ గా డాక్టర్ సౌమిని నియమితులయ్యారు. ఆంధ్ర మెడిక్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జె. కిశోర్ను పదోన్నతిపై పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్ గా నియమించారు. విజయనగరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడును శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్గా, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజను విజయనగరం బోధనాసుపత్రి సూపరింటెండెంట్ గా, నంద్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. మల్లీశ్వరిని అనంతపురం జీజీహెచ్ సూపరింటెండెంట్ గా బదిలీ చేశారు.




# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. ఓటర్ల సంఖ్య 3.92లక్షలు!

హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో త్వరలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. జూబ్లీహిల్స్ పరిధిలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొంది. వీరిలో 2,04,288 మంది పురుషులు కాగా, 1,88,356 మంది మహిళలు, 25 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపింది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 17 వరకు దరఖాస్తులు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కొత్తగా ఓటు నమోదు, చిరునామా మార్పుల కోసం కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 29 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులను పరిశీలించి 30న ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 139 భవనాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## విమాన ఇంధనంలో కల్తీ..

### ప్రయాణికుల ప్రాణాలు గాల్లోనే: జస్టిస్ నగేష్ బీమపాక



హైదరాబాద్: విమాన ఇంధన కల్తీపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ బీమపాక కీలక వ్యాఖ్యలు చేశారు. ''విమాన ఇంధనాన్ని కూడా కల్తీ చేస్తున్నారు. గాల్లో ఉండగా కల్తీ ఇంధనం వల్ల సమస్య తలెత్తితే బాధ్యులెవరు? ప్రయాణికుల ప్రాణాలు గాల్లోనే కలుస్తాయి'' అని విమాన ఇంధన సరఫరా గుత్తేదారు గురునాథం పిటిషన్ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. శంషాబాద్ విమానాశ్రయానికి ఇంధనం సరఫరా చేస్తున్న గురునాథం కంపెనీ ట్యాంకర్లలో కల్తీ జరిగిందని ఐవోసీఎల్ చర్యలు తీసుకుంది. అతని కాంట్రాక్ట్ రద్దు చేసి.. డిపాజిట్‌ను జప్తు చేసింది. ఐవోసీఎల్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గుత్తేదారు గురునాథం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదన్న విషయం స్పష్టమైంది

**: ఎమ్మెల్యే వివేకానంద**

హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత విషయంలో కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కవిత చర్యల వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని కేసీఆర్ గుర్తించారని చెప్పారు. పార్టీకి నష్టం చేస్తే ఎవరినీ ఉపేక్షించకూడదనే సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తప్పు చేస్తే కుటుంబసభ్యులనైనా సహించనని కేసీఆర్ గతంలోనే చెప్పారని, కన్న బిడ్డకంటే కష్టంలో పార్టీకి అండగా ఉన్నవారే ముఖ్యమని చాటారని తెలిపారు. పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదన్న




విషయం స్పష్టమైందని ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్యానించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవు: పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే కవితపై చర్యలు తీసుకున్నట్లు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. 60లక్షల పార్టీ కార్యకర్తల మనోభావాల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ''పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవు. కన్నబిడ్డ కంటే పార్టీ శ్రేయస్సే ముఖ్యమని కేసీఆర్ తెలియజేశారు. కాంగ్రెస్ ఉచ్చులో పడి ఆ పార్టీ చెప్పినట్లు కవిత నడుచుకుంటున్నారు. ప్రాంతీయ పార్టీల్లో కుటుంబ కలహాలు సృష్టించడం కాంగ్రెస్‌కు అలవాటు''అని అన్నారు.

## కాళేశ్వరం అవినీతిపై ఆధారాలు ఇచ్చి సీబీఐకి సీఎం రేవంత్‌రెడ్డి సహకరించాలి : ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు విషయంలో కేంద్రానికి లేఖ రాసిందని భాజపా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సీబీఐతో దర్యాప్తు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. 22 నెలల నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు కాలయాపన చేశారో తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సీబీఐకి ఆ ఆధారాలు ఇచ్చి విచారణకు సహకరించాలన్నారు. ''తెలంగాణ ఏర్పాటుకు యువత, ఉద్యోగులు, ప్రజలు పోరాటం చేశారు. అమరుల త్యాగాలను కేసీఆర్ కుటుంబం క్యాష్ చేసుకుంది. భారత రాష్ట్ర సమితి రూ. కోట్లకు పడగలెత్తింది. ఇటీవల కాళేశ్వరం కూలితే.. తాజాగా భారత రాష్ట్ర సమితి కూలిపోయింది. ఎమ్మెల్సీ కవిత బహిరంగంగా హరీశ్‌రావు, సంతోష్ అవినీతికి పాల్పడ్డారని, వారిద్దరూ అవినీతి అనకొండలు అని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను బలిపశువును చేశారని అన్నారు. అంటే హరీశ్‌రావు, సంతోష్ అవినీతిలో కేసీఆర్‌కు పాత్ర ఉందనే అర్థం. నిష్పక్షపాతంగా సీబీఐ దర్యాప్తు జరగాలి.. అవినీతిపరులకు శిక్ష పడాలి. అవినీతిలో అధికారులు, కాంట్రాక్టర్లు



ఎవరున్నా వారిని శిక్షించాలి''అని ఎంపీ లక్ష్మణ్ అన్నారు.




## మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అవకతవకలపై ఈడీ చర్యలు..

హైదరాబాద్: మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అవకతవకలపై ఈడీ చర్యలకు ఉపక్రమించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్లలోని రూ.1.1 కోట్ల విలువైన స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసింది. బ్యాంకు మాజీ ఎండీ, సీఈవో ఉమేష్ చంద్ అసవా కుమారుడు రోహిత్ అసవా పేరిట ఈ ఆస్తులు ఉన్నాయి. రుణాల కోసం 2, 4శాతం కమీషన్ వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అక్రమ సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ గుర్తించింది. మాజీ ఛైర్మన్ రమేష్ కుమార్ బంగ్, ఉమేష్ చంద్ అసవా, పురుషోత్తం దాస్ మందానపై ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి. అక్రమాస్తుల కొనుగోలు ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ భావిస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

## ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని గెలిపించాలి

**: ప్రొఫెసర్ కోదండరామ్**

హైదరాబాద్: ఈ ఉపరాష్ట్రపతి ఎన్నికలు.. దేశ ప్రయాణం ఏ దిశలో సాగాలో నిర్దేశించే ఎన్నికలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కోదండరామ్ మీడియాతో మాట్లాడారు. ఆధిపత్యం, అధికారం కోసం మాత్రమే ఆలోచిస్తున్న కొందరికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను రక్షించడం కోసం పార్టీలకు అతీతకంగా ముందుకొచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. న్యాయ కోవిదులు, యూనివర్సిటీల మాజీ వీసీలు,



రాజ్యాంగబద్ధ సంస్థల మాజీ ఛైర్మన్‌లు, సీనియర్ జర్నలిస్ట్‌లు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వ్యక్తులు సుదర్శన్ రెడ్డికి మద్దతుగా సంతకాల చేశారని చెప్పారు. అర్బన్ నక్సలైట్ అంశంపై కోదండరామ్ మాట్లాడుతూ.. ''అర్బన్ నక్సలైట్ అంటే అర్థం ఏంటో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. అర్బన్ ఏరియాలో పని చేసినంత మాత్రాన నక్సలైట్ ముద్ర వేయడం ఏంటి?ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పనిచేస్తే ఆ ముద్ర వేసేస్తారా?సామాజిక అభివృద్ధి, వికాసం పట్ల ఈ ముద్ర వేసేవారికి వ్యతిరేకత ఉందని అనుకోవాలి. అణచివేసే ప్రయత్నం చేస్తున్నారంటేనే.. ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకత ఉందని అర్థం. ప్రజాస్వామ్య పరిరరక్షణ దేశ ప్రయోజనాలను జస్టిస్ సుదర్శన్ రెడ్డి కాపాడతారు. ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నా''అని కోదండరామ్ అన్నారు.



## ఉద్యోగ సంఘాల జేఏసీతో భట్టి, శ్రీధర్‌బాబు చర్చలు.. ఛలో హైదరాబాద్ వాయిదా

హైదరాబాద్: సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు చర్చించారు. ఈనెల 8న విధివిధానాలు ఖరారు చేసి, త్వరలో హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ హామీ ఇచ్చింది. టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి వర్గ ఉప సంఘం తెలిపింది. పెండింగ్ బిల్లుల విడుదల, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు హామీ లభించింది. విజిలెన్స్, ఏసీబీ కేసులతో రెండేళ్లకు పైగా సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కేబినెట్ సబ్ కమిటీ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈనెల 8 నుంచి 19 వరకు చేపట్టనున్న జిల్లా బస్సు యాత్ర, 12న ఛలో హైదరాబాద్ వాయిదా వేస్తున్నట్టు ఉద్యోగ సంఘాల ఐకాస తెలిపింది.

## వాళ్ల ఆస్తుల తగాదాలతో మాకేం సంబంధం లేదు

**: మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెండ్ కావడంపై తాము స్పందించబోమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆమెపై సస్పెన్షన్ ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని చెప్పారు. ఆస్తులు, వాటాల్లో వారి మధ్య తగాదాలున్నాయని గతంలోనే తాను చెప్పినట్లు గుర్తు చేశారు. ఆ తగాదాలే సస్పెన్షన్‌కు దారి తీసి ఉండొచ్చన్నారు. ''కొందరు కవిత వెనుక ఉన్నామన్నారు. మరికొందరు హరీశ్‌రావు, సంతోష్ వెనుక ఉన్నామని చెబుతున్నారు. కానీ, మేం ప్రజల వెంట ఉన్నాం. మిగతా ఎవరి వెనకాల లేము. మేం ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. ప్రజలు మా వెంట ఉన్నారు. ఎవరికో వత్తాసు పలకాల్సిన అవసరం మా పార్టీకి, సీఎంకు లేదు. అవినీతిపరులందరినీ దూరం పెడతాం. కేసీఆర్ కుటుంబం కూడా అవినీతిలో కూరుకుపోయింది. అవినీతి సంపదలో వాటాల విషయంలో తగాదా వచ్చినట్లుంది. వారి తగాదాలతో మాకు సంబంధం లేదు''అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.



### సుగాలి ప్రీతి మృతి కేసు మరోసారి సీబీఐకి: ఏపీ ప్రభుత్వం నిర్ణయం




అమరావతి: కర్నూలు జిల్లాలో సంచలనం సృష్టించిన పదోతరగతి విద్యార్థి సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2017 ఆగస్టు 18న కర్నూలులోని పాఠశాల వసతి గృహంలో సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ ఆమె మృతదేహం కనిపించింది. వైకాపా హయాంలో ఈ కేసు సీబీఐకి ఇచ్చినా దర్యాప్తు ముందుకు సాగలేదు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేస్తామని కూటమి నేతల హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో ఈ కేసును మరోసారి సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్: ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ''కేసీఆర్ నిర్ణయంతో మహిళలు ఎక్కువగా సంతోషపడుతున్నారు. కవిత వ్యాఖ్యలు భారత రాష్ట్ర సమితికి నష్టం చేసేలా, కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయి. నష్ట నివారణ, కార్యకర్తలకు స్థైర్యం ఇచ్చేందుకు కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా ఉపేక్షించేది లేదని ఆయన గతంలో చెప్పారు.. అందుకు అనుగుణంగానే నిర్ణయం తీసుకున్నారు. 20 నెలలుగా కార్యకర్తలు అలుపెరుగని పోరాటం చేస్తుంటే.. కవిత వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేస్తున్నాయి. పార్టీని నమ్ముకున్న సైనికుల కంటే పేగుబంధం గొప్పది కాదని కేసీఆర్ భావించారు. కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా హర్షిస్తున్నాం'' అని సత్యవతి రాథోడ్ అన్నారు.




*** భారత రాష్ట్ర సమితిని విమర్శిస్తే.. కేసీఆర్‌ను విమర్శించినట్టే: గొంగిడి సునీత**

భారత రాష్ట్ర సమితిని విమర్శిస్తే.. కేసీఆర్‌ను విమర్శించినట్టేనని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ''పార్టీ ఉంటే ఎంత.. పోతే ఎంత అని కవిత అంటున్నారు. రెండు సార్లు ఎంపీ టికెట్, రెండు సార్లు ఎమ్మెల్సీ అవకాశం ఎలా వచ్చింది. క్షేత్రస్థాయికి వెళ్తే కవితకు పరిస్థితులు అర్థం అవుతాయి. కవితకు కేసీఆర్ కన్నతండ్రి.. కోట్లాది మంది ప్రజలు కేసీఆర్‌ను బాపు అని పిలుచుకుంటున్నారు. పార్టీకి చాలా మంది ద్రోహం చేశారు. అందులో తాను కూడా ఉండాలని కవిత అనుకుంటే ఏం చేయలేం. కవిత తనకు తానే గొయ్యి తీసుకున్నట్లు అర్థం అవుతుంది. వెనుక ఎవరు ఉండి నడిపిస్తున్నారో కాలమే తేలుస్తుంది. కవితకు పార్టీ అనేక అవకాశాలు కల్పించింది. పార్టీ నుంచి బయటకు వెళ్లిన చాలా మంది ఏమయ్యారో అందరికీ తెలుసు, కవిత కూడా అంతే'' అని సునీత అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు బాధ కలిగించాయి. హరీశ్‌రావు, సంతోష్‌పై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు బాధ కలిగించాయని మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. ''పేగు బంధం కంటే.. పార్టీ బంధం, ప్రజా బంధం గొప్పది అని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ నాడు తన ప్రాణాన్ని పణంగా పెట్టారు. ఇవాళ పార్టీ కోసం తన కుటుంబ బంధాన్ని కూడా పణంగా పెట్టుకున్నారు'' అని మాజీ ఎంపీ అన్నారు.

# గిరిజన ప్రాంతమైన బెండలపాడు చారిత్రక ఘట్టం..

*** పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు..**
*** రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పేదవారి సొంతింటి కల నెరవేరబోతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం బెడాలపాడు గ్రామంలో జరగబోయే ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల ఏర్పాట్లను గృహనిర్మాణ శాఖ ఎండి వి. పి. గౌతమ్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతమైన బెండలపాడు గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం ఒక చారిత్రక ఘట్టం. ఇది గ్రామ ప్రజలకు సంతోషకరమైన , గుర్తుండిపోయే రోజు అవుతుంది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలి అని సూచించారు. మంత్రి అధికారులు గృహప్రవేశ వేడుకలను పండుగ వాతావరణంలో, అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం, గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దడంలో ఎలాంటి లోటు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మాట్లాడుతూ మంత్రి తెలిపారు, మా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గృహనిర్మాణ శాఖను బలోపేతం చేస్తూ, పేదవారికి న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో ఇళ్లను మంజూరు చేస్తున్నాం. లబ్ధిదారుల ఎంపిక నుండి వారి ఖాతాల్లో నిధుల జమ వరకు మొత్తం ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగినా వాటిని వెంటనే గుర్తించి, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు కొందరిని సస్పెండ్ చేయడం, కేసులను ఏసీబీకి అప్పగించడం కూడా జరిగింది అని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వానికి ఓటు వేసిన వారికే కాకుండా, రాజకీయాలు, కులం, మతం అనే తేడా లేకుండా ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేరేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకం వల్ల జిల్లాలోనే సుమారు 21,500 కుటుంబాల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారులను ప్రత్యక్షంగా ఉద్దేశించి మాట్లాడి, వారి సంతోషంలో పాలుపంచుకుంటారు అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం గృహనిర్మాణ శాఖను నిర్వీర్యం చేసి, పేదవారి కలలను దెబ్బతీసింది. కానీ మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహనిర్మాణ శాఖను తిరిగి బలోపేతం చేసి, లక్షలాది పేదలకు గృహాల కలను నిజం చేసేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. ఈ మహత్తర గృహప్రవేశ కార్యక్రమానికి జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి, ఇతర సహచర మంత్రులు, శాసనసభ్యులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. ఈ పరిశీలనలో టీజీ ఐడిసి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల గుండెల్లో చిరుస్థాయిగా నిలిచిపోయే గొప్ప నాయకుడు వైఎస్ ఆర్

*** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పేద ప్రజల గుండెల్లో చిరుస్థాయిగా నిలిచిపోయే గొప్ప నాయకుడు వైఎస్ ఆర్ అని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం షాపూర్ నగర్ లో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళలు, కార్యకర్తలతో కలిసి చౌరస్తాలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి, సంక్షేమప్రాధాత డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు కాలినడకన బయలుదేరి ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పేదల సంక్షేమ పథకాల పితామహుడు, రైతు భాంధువుడు, అపర భగీరథుడు, ఆరోగ్యశ్రీ ప్రధాత, వైఎస్ ఆర్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కెకెయం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్, ఎక్స్ కౌన్సిలర్ జయరాం, ఎక్స్ కౌన్సిలర్ రంగారావు, సిహెచ్ బుచ్చిరెడ్డి,బి శివకుమార్ గౌడ్, కూన రాఘవేంద్ర గౌడ్, రషీద్ బేగ్, చాంద్ పాషా, పెంటయ్య ముదిరాజ్, చౌడా శ్రీనివాస్, బాలప్ప, టిల్లు, పవన్ గుప్తా, షాకీర్, మధుసూదన్, కే శంకర్, గుబ్బల రమణ, మల్లం శీను, తోకల శ్రీను, రంగనాథ్, ఎల్లయ్య, అరుణ్ కుమార్, బిల్లా, పిల్లి ఆంజనేయులు, మురళి, దినేష్, తౌఫిక్, గోపాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, వెంకటేష్ యాదవ్, లింగం యాదవ్, డాన్ శీను, అలివేలు, పూలమ్మ, శ్యామల, అరుణ, కిషోరి, కృష్ణ గౌడ్, మక్బుల్ బాయ్, వాణి, రఘు యాదవ్, జాంగిర్, గౌరిశెట్టి శివ, మురళి గౌడ్, రజాక్, రమేష్ గౌడ్, లక్ష్మణ్, వెంకట్, పార్టీ నాయకులు, మహిళ నాయకురాలు, యువజన పార్టీ నాయకులు, ఎన్ఎస్యుఐ నాయకులు,అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## పంచశీల స్కూల్ లో గో విజ్ఞాన పుస్తకాల ఆవిష్కరణ

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో మంగళవారం గో సేవా విభాగం తెలంగాణ ఆధ్వర్యంలో గో విజ్ఞాన పుస్తకాలను తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుమ్మడివల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో విజ్ఞాన పరీక్షలు నిర్వహిస్తున్నామని, పది సంవత్సరాల పై బడిన ప్రతి ఒక్కరు రాయవచ్చని తెలిపారు. ఈ నెల 10వ తేదీన పాఠశాలలో పరీక్ష ఉంటుందని, తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయి లో పోటీ ఉంటుందని అన్నారు. మొదటి బహుమతి లక్ష, రెండో బహుమతి 50 వేలు, మూడో బహుమతి 25 వేలు ఉంటాయని అన్నారు. ఆవు, వ్యవసాయం, పర్యావరణం, సేంద్రియ ఎరువులు, సైబర్ క్రైమ్ డ్రగ్స్ నివారణ వంటి అంశాలపై పరీక్ష ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 6304085950 నంబర్ లలో సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గో సేవా విభాగం ప్రతినిధులు నక్క రాజేష్, నరేందర్ గౌడ్, లక్ష్మీ కాంత్, రామ్, సెయింట్ అగథ స్కూల్ కరస్పాండెంట్ సుకృత్ కుమార్, సెయింట్ మేరీ జోసెఫ్ హై స్కూల్ కరస్పాండెంట్ శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో స్మృతివనం ఏర్పాటుకు
### రూ.38 కోట్లు మంజూరు

తాడ్వాయి(ములుగు): ములుగు జిల్లా మేడారం అంటే రెండేళ్లకోసారి జరిగే మహాజాతరనే గుర్తుకొచ్చేది. అలాంటి క్షేత్రం ప్రస్తుతం 3 వేల మంది భక్తులతో నిత్య జాతరలా కనిపిస్తోంది. సెలవులు, ఆదివారాల్లో ఈ సంఖ్య 10 వేలు దాటుతోంది. ముఖ్యంగా రామప్ప, లక్నవరం, బొగత జలపాతం సందర్శనకొచ్చే పర్యాటకులు ఇక్కడి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలనూ దర్శించుకొని వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేస్తోంది. అమ్మవార్లకు ప్రభుత్వం కేటాయించిన నారిగెబంధం గుట్టపై ఉన్న 28.95 ఎకరాల్లో స్మృతివనం ఏర్పాటు చేయాలని నిర్ణయించి.. రూ.38 కోట్లు మంజూరు చేసింది. మేడారంలో ఒక నిర్మాణానికి ఇంత పెద్దమొత్తంలో నిధులివ్వడం ఇదే మొదటిసారి. 28.95 ఎకరాల చుట్టూ



భవనాలు నిర్మించి మధ్యలో ఈత కొలను, గడ్డి మైదానాలు, ఆట స్థలాలు, దేవతల చరిత్ర, ఆదివాసీల సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణాలు చేపట్టనుంది. జంపన్నవాగు పరిసరాల సుందరీకరణకు ప్రభుత్వం ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేసింది. గద్దెల ప్రాంగణానికి కొద్దిదూరంలోని ఈ విశాల ప్రదేశంలో ఇప్పటికే దేవాదాయశాఖ విడిది గృహాలు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. ఇక స్మృతివనమూ ఏర్పాటైతే మేడారం ముఖచిత్రం మారిపోనుంది.

## ఘనంగా స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మహానేత,దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా, తెట్టెబావి ఆనంద్ ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ లో గల వైయస్సార్ విగ్రహానికి వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల , వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి, కారుమూరి వెంకట్ రెడ్డి పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్ర రెడ్డి లు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్ ఆంటోనీ స్కూల్ ప్రిన్సిపల్ జీవన్ ప్రసాద్, కె.రమణా రెడ్డి, డి.కిషోర్ కుమార్ , శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ రావు, ప్రమోద్, సల్మాన్, ప్రభాకర్, వేణు రెడ్డి, ఆంజనేయులు, విక్కీ, సునీల్, ఇర్మియ, సులోచన, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి

*** భాజపాకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్**

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారత రాష్ట్ర సమితితో రాజకీయ లోపాయికారీ ఒప్పందాన్ని పక్కనపెట్టి కాళేశ్వరంపై నిష్పక్షపాతంగా సీబీఐ విచారణ జరిపించి దోషులను శిక్షించాలని భాజపాను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో కర్త, కర్మ, క్రియ అని తానే అని చెప్పుకొన్న మాజీ సీఎం కేసీఆర్ అవినీతికి బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నారు. కవిత పాత్రతో కేసీఆర్ కుటుంబం కొత్త నాటకానికి తెరతీసిందని విమర్శించారు. ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, శాట్జ్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలతో కలిసి ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కొన్నేళ్లుగా నడ్డా మొదలుకొని బండి సంజయ్ వరకు భాజపా నేతలు కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం మారిందని మాట్లాడారు. ఇప్పుడది సీబీఐ పరిధిలోకి వెళ్లింది. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి భాజపా చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. కాళేశ్వరం అవినీతిలో కాంట్రాక్టర్ల పాత్రపై విచారణ జరిపి.. నిజమని తేలితే చర్యలు తీసుకోవాలని సీఎంని కోరుతున్నా. భారత రాష్ట్ర సమితిలో కవిత సస్పెన్షన్ వ్యవహారంతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు. ఆమెను కాంగ్రెస్‌లోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. అవినీతి సంపాదనల వాటాల్లో వచ్చిన తేడా వల్లే కవితను సస్పెండ్ చేసి ఉండొచ్చు. ఇదంతా కేసీఆర్ కుటుంబం ఆడుతున్న డ్రామా' అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

## హిమానీనద సరస్సులతో ముప్పు! – సీడబ్ల్యూసీ అలర్ట్

హిమానీనద సరస్సులు ఆందోళనకర రీతిలో విస్తరిస్తున్నాయని, వీటిపై కచ్చితమైన పర్యవేక్షణ అవసరమని సెంట్రల్ వాటర్ కమిషన్ పేర్కొంది. భారత్ పరిధిలో 400లకు పైగా సరస్సులు ఇటువంటి ముప్పు అంచున ఉన్నాయని తాజా మానిటరింగ్ రిపోర్టులో వెల్లడించింది. లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ సరస్సులు.. ఆకస్మిక, విధ్వంసం సృష్టించే వరదలకు కారణమయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. అందుకే వీటిపై తీవ్రమైన పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేసింది. గ్లేసియల్ లేక్ అట్లాస్ 2023 ప్రకారం భారత్ పరిధిలో ఉన్న 681 హిమానీనద సరస్సుల్లో 432 సరస్సుల విస్తీర్ణం ఇటీవల పెరిగింది. వీటి విస్తీర్ణం 2011లో 1917 హెక్టార్లుగా ఉండగా.. ప్రస్తుతం 2508 హెక్టార్లకు పెరిగింది. దీంతో దాదాపు 30 శాతం పెరిగినట్లు సీడబ్ల్యూసీ నివేదిక వెల్లడించింది. విస్తరిస్తున్న సరస్సులు అరుణాచల్ ప్రదేశ్‌లో అత్యధికంగా ఉన్నాయని (197), ఆ తర్వాత లద్దాఖ్ (120), జమ్మూ కశ్మీర్ (57), సిక్కిం (47), హిమాచల్ ప్రదేశ్ (6), ఉత్తరాఖండ్ (5)లలో ఉన్నాయని తెలిపింది. మొత్తంగా హిమాలయ ప్రాంతంలో 1435 హిమానీనద సరస్సులు, నీటి వనరులు విస్తరించాయని పేర్కొంది. వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరంతోపాటు ఉపగ్రహ ఆధారిత అలర్ట్‌లు,



లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగానే అప్రమత్తం చేసే వ్యవస్థల ఏర్పాటు, తక్షణ సంసిద్ధత అవసరమని సీడబ్ల్యూసీ పేర్కొంది. కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ, ఎన్డీఎంఏ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థలతోపాటు పొరుగు దేశాలైన నేపాల్, భూటాన్, చైనాలతోనూ సమన్వయపరచుకోవాలని సూచించింది. దేశంలో పలు రాష్ట్రాల్లో ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కొండచరియలు విరిగిపడుతుండగా, పంజాబ్‌లోనూ వరదలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఇటీవల 34 మంది చనిపోయారు. దీంతో మాతా వైష్ణో దేవి ఆలయ మార్గాలను మూసివేశారు. ఈ నేపథ్యంలోనే వివిధ విభాగాలను సెంట్రల్ వాటర్ కమిషన్ అప్రమత్తం చేసింది.

## మసీదులో గణేశ్ మహరాజ్!

సాంగ్లీ: మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా గోట్ఖిండీ గ్రామం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడ స్థానికులు ఏటా గణేశుడి విగ్రహాన్ని మసీదులో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. 1980లో ఈ సంప్రదాయం ప్రారంభమైంది.



ఆ ఏడాది భారీ వర్షం కారణంగా ఓ గణపతి విగ్రహాన్ని మసీదులోకి మార్చారు. అప్పటి నుంచి ఏటా మసీదులోనే వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు. హిందూ ముస్లింలు ఉమ్మడిగా ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఒకసారి బక్రీద్, వినాయక చవితి ఒకేసారి రాగా.. ముస్లింలు నమాజ్ మాత్రమే చేసి, కుర్బానీకి దూరంగా ఉన్నారు.

## గణపయ్యకు 'గోల్డెన్ ఉండ్రాళ్లు'.. ధరెంతో తెలిస్తే షాక్!

వినాయక చతుర్థి వేడుకలు దేశ వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని నాసిక్‌లో సాగర్ స్వీట్స్ వినూత్నంగా 'గోల్డెన్ మోదక్'(ఉండ్రాళ్లు)ను తయారు చేసింది. ఒక్క కిలో ధర రూ.20 వేలు ఉండడంతో ఇప్పుడీ మోదక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిలో బంగారాన్ని వినియోగించినట్లు దుకాణదారులు పేర్కొన్నారు. ఈ పోస్టుపై నెటిజన్లు తమ అభిప్రాయాలను కామెంట్ల రూపంలో పంచుకున్నారు. దీన్ని తినాలా? లేక లాకర్‌లో పెట్టాలా? అని ఓ యూజర్ ప్రశ్నించగా.. దేవుడి పేరుతో ఫ్రాడ్ చేస్తున్నారా? అంటూ మరొకరు రాశారు. గోల్డెన్ సమోసా లేదా పానీపూరీ తింటామా? లేదు కదా! అని ఇంకొకరు ఎద్దేవా చేశారు. మనల్ని సృష్టించిన వాడికి మనం ఏమి బహుమతి ఇవ్వగలం? అంటూ మరొకరు కామెంట్ చేశారు. గతేడాది పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా భవానీపూర్ ప్రాంతంలో ఉన్న ఓ మిఠాయి దుకాణం 500 కేజీల లడ్డూని తయారు చేసి తన ప్రత్యేకతను చాటింది. కాజు కట్లీ, జీడిపప్పు, వేరుశనగలతో అలంకరించిన ఆ లడ్డూపై చిన్న గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం విశేషంగా ఆకట్టుకుంది.



# పవన్ కళ్యాణ్ బర్త్‌డే స్పెషల్..

## 'ఓజీ' నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్




**టాకీస్:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా ఆయన అభిమానులకు తీపికబురు అందింది. పవన్ నటిస్తున్న తాజా చిత్రం ఓజీ నుంచి బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. "డియర్ ఓజీ.. నిన్ను కలవాలని.. నీతో మాట్లాడాలని.. నిన్ను చంపాలని ఎదురుచూస్తున్న నీ ఓమి".. అంటూ ఇమ్రాన్ హష్మి ఓజీ బర్త్‌డే విషెస్ చెప్పినట్లు గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాకు రన్ రాజా రన్, సాహో చిత్రాలతో స్టార్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్న సుజీత్ సైన్ దర్శకత్వం వహిస్తున్నాడు. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## పవన్ బర్త్‌డే సందర్భంగా అభినందనలు

### అన్న చిరుతో సహా సినీ ప్రముఖుల విషెష్

**టాకీస్:** పవర్‌స్టార్‌గా సినీ రంగంలో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. ఉప ముఖ్యమంత్రిగా ప్రజా సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు పవన్ కల్యాణ్. సామాన్యులే కాదు.. సినీ ప్రముఖులు సైతం పవన్‌కు అభిమానులే. సెప్టెంబర్ 2 ఆయన పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఆయన అప్‌కమింగ్ సినిమా పోస్టర్లు సందడి చేస్తుండగా.. స్టార్స్ ఆయనకు విషెస్ చెబుతున్నారు. 'దీర్ఘాయుష్మాన్ భవ..' అంటూ చిరంజీవి ఓ అరుదైన ఫొటోతో పవన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చలనచిత్ర రంగంలో అగ్ర నటుడిగా, ప్రజా జీవితంలో జనసేనానిగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న కళ్యాణ్ బాబుకి జన్మదిన శుభాకాంక్షలు. ప్రజా సేవలో నువ్వు చూపుతున్న అంకితభావం చిరస్మరణీయం. ప్రజలందరి అంటూ ముందడుగు వేసే వకీల్ సాబ్. తానే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి వర్యులు పవన్ కల్యాణ్. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు అని పరుచూరి గోపాలకృష్ణ ప్రకటించారు. చరిత్రలో ఒకే ఒక్కడు.



ఆశీస్సులతో, అభిమానంతో నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజలకు మార్గదర్శకుడిగా నిలవాలని ఆశీర్వదిస్తున్నాను. దీర్ఘాయుష్మాన్ భవ అని చిరంజీవి తమ్ముడిని ఆశీర్వదించారు. మన పవర్ స్టార్, డిప్యూటీ- సీఎం పవన్

కల్యాణ్‌కు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ అల్లు అర్జున్ విషెస్ తెలిపారు. నాకు పట్టుదల నేర్పించి.. నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన నా గురువుకు జన్మదిన శుభాకాంక్షలు. హ్యాపీ బర్త్‌డే కల్యాణ్ మామ అంటూ సాయి దుర్గ తేజ్ విషెస్ తెలిపారు. మీరు లక్షల మందికి స్ఫూర్తి. నిజమైన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు అంటూ దర్శకుడు జ్యోతి కృష్ణ అభినం దించారు. తాను ఒక యోగి, ఒక త్యాగి, నూటికి ఒక్కడు కాదు.. కోటికి ఒక్కడు. అతను అక్కడి అమ్మాయికి ఇక్కడి అబ్బాయి కాదు, ఎక్కడున్నా నేను మీకోసం కోట్ల మంది గుండెల్లో ఆశాజ్యోతిగా మారిన మహోన్నత వ్యక్తి పవన్ కల్యాణ్. మీ పుట్టుకే ఒక అద్భుతం. హ్యాపీ బర్త్‌డే మై బాస్. మీరు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, ఆనందంగా, మహోన్నతంగా ఉండాలని హృదయపూర్వకంగా కోరుకుంటూ బండ్ల గణేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

హ్యాపీ బర్త్‌డే పవన్‌కల్యాణ్ గారు.. మీ నిస్వార్థ స్వభావాన్ని ప్రత్యక్షంగా చూస్తూ పెరిగినందుకు నేను నిజంగా అదృష్టవంతుడిని. మీ ప్రయాణం నాకే కాదు..లక్షల మందికి స్ఫూర్తినిస్తూనే ఉంది. మీరు మరింత ఉన్నతస్థానాలకు చేరుకోవాలని కోరుకుంటున్నా అంటూ రామ్ చరణ్ శుభాకాంక్షలు తెలిపారు.

హ్యాపీ బర్త్‌డే మై డియర్ ఫ్రెండ్ పవన్ కల్యాణ్. మీరు చేసే ప్రతి పని మీకు ఆనందాన్ని, విజయాన్ని ఇవ్వాలని వెంకటేశ్ అన్నారు.



# మార్పు మన ఇంటినుంచే మొదలు కావాలి

## నటి కృతి సనన్ వెల్లడి

టాకీస్: హీరోయిన్ కృతి సనన్ మరో ఘనత సాధించారు. 'ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్' ఇండియాకు లింగ సమానత్వ గౌరవ రాయబారిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో లింగ వివక్షపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో హీరోలకు ఉన్నన్ని సౌకర్యాలు హీరోయిన్‌లకు ఉండవని ఆమె తెలిపారు. సౌకర్యాల విషయంలోనే కాదు.. నటీనటులను గౌరవించడంలోనూ అసమానత చూపుతారు. హీరోలకు పెద్దకార్లు, విలాసవంతమైన గదులు కేటాయిస్తారు. ఇది చాలా చిన్న విషయాలే కావచ్చు. కానీ, అలా ఎందుకు చేస్తారని బాధపడతాను. కేవలం కార్లు, సౌకర్యాల గురించే కాదు మహిళలను తక్కువ చేసి చూడడం గురించి నేను మాట్లాడుతున్నాను. హీరోలతో సమానమైన గౌరవానికి మేం కూడా అర్హులమే. షూటింగ్ విషయంలోనూ ఇలానే జరుగుతుంది. హీరోలు సెట్స్‌కు ఆలస్యంగా వస్తారు. కానీ, హీరోయిన్లు మాత్రం -టైం కంటే ముందే వెళ్లి వారి కోసం ఎదురుచూస్తూ ఉండాలి. అసిస్టెంట్ డైరెక్టర్లు నన్ను ముందే సెట్స్‌కు రావాలని పిలుస్తారు. హీరోలకు మాత్రం ఆ మాట చెప్పలేరు. ఇలాంటి ఆలోచనా విధానంలోనే మార్పు రావాలని కృతిసనన్ అభిప్రాయపడ్డారు. ఇక తన తల్లి గురించి కృతి కొన్ని విషయాలను ప్రస్తావించారు. ఆమె ఎంతో కష్టపడి ఉన్నతస్థాయికి వచ్చినట్లు- తెలిపారు. మా అమ్మ పెరిగిన వాతావరణంలో పురుషులను ఎక్కువగా గౌర వించేవారు. మహిళలు అంటే కేవలం వంట గదికే పరిమితం అని భావించేవారు. ఈత, నృత్యం నేర్చుకోవాలని ఆమె అప్పట్లో ఎన్నో కలలు కన్నది.. కానీ, కుదర్లేదు. చదువు కోసం పోరాటం చేసింది. ఇప్పుడు ఆమె ప్రొఫెసర్. ఆ పోరాటస్ఫూర్తితోనే నన్ను, నా సోదరిని పెంచింది. మాకు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా స్వేచ్ఛనిచ్చిందఅని తెలిపారు. మార్పు ముందు ఇంట్లో నుంచే ప్రారంభం కావాలని కృతి అన్నారు.

# 'మట్టి కుస్తీ'కి సీక్వెల్‌ను ప్రకటించిన విష్ణు విశాల్




**టాకీస్:** తమిళ నటుడు విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'గట్ట కుస్తీ' (తెలుగులో మట్టి కుస్తీ) స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం 2022లో విడుదలై తమిళంతో పాటు తెలుగులో మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాకి సీక్వెల్‌ను ప్రకటించారు మేకర్స్. కథానాయకుడు విష్ణు విశాల్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సినిమాకి 'గట్ట కుస్తీ 2' అని పేరు పెట్టారు. దీనికి సంబంధించిన ఒక అనౌన్స్‌మెంట్ వీడియోను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. 'గట్ట కుస్తీ' సినిమాకు దర్శకత్వం వహించిన చెల్లా అయ్యావు ఈ సీక్వెల్‌కు కూడా దర్శకత్వం వహించబోతుండగా.. మొదటి భాగంలో నటించిన విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మీ ఈ సీక్వెల్‌లో కూడా ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే, కరుణాస్, మునీష్కాంత్, కాళీ వెంకట్ వంటి నటులు కూడా ఇందులో కొనసాగనున్నారు. విష్ణు విశాల్ తన సొంత నిర్మాణ సంస్థ 'విష్ణు విశాల్ స్టూడియోస్'తో పాటు 'వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్'తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# గంజాయి స్మగ్లింగ్ ఆధారంగా ఘాటి

## పుష్పతో పోలుస్తూ నెట్టింట కామెంట్స్

**టాకీస్:** బాహుబలి, అరుంధతి తర్వాత 'ఘాటి'తో మరోసారి తన పవర్ చూపేందుకు అనుష్క సిద్ధమయ్యారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఆమె నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే, ఈ సినిమా ట్‌ఐలర్ విడుదలైన నాటినుంచి అనుష్క నటనను పుష్పలోని అల్లు అర్జున్ పాత్రతో పోలుస్తూ కొన్ని పోస్టలు వెలువెడుతున్నాయి.ఈ సినిమాలో అనుష్క గంజాయి స్మగ్లింగ్ చేసే ఘాటి శీలావతిగా కనిపించున్నారు. తాము చేస్తున్న పని తప్పని తెలుసుకొని ఆ నేర వృత్తి నుంచి బయటకొచ్చి.. గంజాయి ముఠాను నడిపించే వ్యవస్థపై తిరుగుబాటు- చేసే పవర్‌ఫుల్ పాత్రగా క్రిష్ దీన్ని తీర్చిదిద్దారు. 'పుష్ప'లోనూ ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే పాత్రలో అల్లు అర్జున్ కనిపించిన విషయం తెలిసిందే. తాజా ఇంటర్వ్యూలో అనుష్క ఈ క్రాస్ ఓవర్‌పై స్పందించారు. ఇది చాలా మంచి ఐడియా అని.. అదే జరిగితే ఆడియన్స్‌కు థ్రిల్ ఖాయమన్నారు. క్రిష్ దర్శకత్వంలో మరోసారి నటించడంపై అనుష్క స్పందించారు. వేదం సినిమాలో సరోజ పాత్ర ఇప్పుడు 'ఘాటి'లో శీలావతి.. రెండింటినీ నేను ఎప్పటికీ మర్చిపోలేను. క్రిష్ నన్ను నమ్మి ఇలాంటి అవకాశం ఇవ్వడం గౌరవంగా ఉంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.